# సాక్షి సంగారెడ్డి


బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023







**బియ్యం లారీలో మంటలు**

చౌటకూర్ మండలం శివ్వంపేట శివారులో మంగళవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. 8లో



**ఆ ఇద్దరు ఎక్కడ?**

రామాయంపేట మండలం నార్సింగిలో అదృశ్యమైన యువతి, యువకుడికి చెప్పులు, బైక్‌ను మంగళవారం ఉదయం నార్సింగి చెరువు వద్ద పోలీసులు గుర్తించారు. 8లో



**సిద్దిపేటలో సెంట్రల్ 'నర్సరీ'**

సిద్దిపేట పట్టణ శివారులోని మర్పడ్గలో 50 ఎకరాల్లో సెంట్రల్ నర్సరీ ఏర్పాటు చేసేందుకు రూ.5.85 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 8లో

## న్యూస్‌రీల్

### నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్:** పట్టణంలో రూ.12.45కోట్లతో నిర్మిస్తున్న 50 పడకల మాతా, శిశు సంరక్షణ కేంద్రం భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ ఇంజినీరింగ్ విభాగం డీఈ విల్సన్, ఏఈ మిథున్, ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో కలిసి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తయి సేవలు వినియోగంలోకి వస్తే ఈ ప్రాంతవాసులకు వైద్యపరంగా మరింత మేలు జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, కౌన్సిలర్ స్వప్న అభిషేక్ షెట్కార్, చాప్టా(కె) సర్పంచ్ సంగమ్మ సంగప్ప పాల్గొన్నారు.

### జాతరకు రావాలని గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నందీశ్వర్ గౌడ్

**పటాన్‌చెరు టౌన్:** పటాన్‌చెరులో ఈనెల 26వ తేదీన నిర్వహించే రేణుక ఎల్లమ్మ జాతరకు రావాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ని ఆహ్వానించారు. పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత నందీశ్వర్ గౌడ్ కుటుంబ సమేతంగా గవర్నర్ వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛం ఇచ్చి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు.

### రక్షణ చర్యలపై అప్రమత్తంగా ఉండండి

**పుల్‌కల్(అందోల్):** జలవిద్యుత్ కేంద్రంలో ఎప్పటికప్పుడు రక్షణ చర్యలను సమీక్షించుకోవాలని మంగళవారం విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి ముత్యంరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం సింగూరు జలవిద్యుత్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రక్షణ చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఏడీఈలు పాండయ్య, సౌజన్య, ఉద్యోగుల సంఘం నాయకులు చంద్రయ్య పాల్గొన్నారు.

### మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

**సంగారెడ్డి టౌన్:** మహా శివరాత్రి పురస్కరించుకొని ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని మెదక్ రీజియన్ యస్.సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. 17నుంచి 21వరకు ఏడుపాయలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలకు జోగిపేట్, మెదక్, సంగారెడ్డి, నర్సాపూర్, బాల్ నగర్, సదాశివపేట, నారాయణఖేడ్, ఝరా సంఘం, శంకరంపేట్, జహీరాబాద్, జేబీఎస్ నుంచి బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శైవ క్షేత్రాలకు ప్రత్యేకంగా ఎనిమిది బస్సులను నడుపుతున్నట్టు పేర్కొన్నారు. జహీరాబాద్ నుంచి ఝరాసంఘం, శంకరంపేట నుంచి కొప్పోల్, సిద్దిపేట నుంచి వేములవాడకు, దుబ్బాక నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం సహా ఇతర శైవ క్షేత్రాల దర్శనానికి వెళ్లే ప్రయాణికులు 30 కంటే ఎక్కువ మంది ఉంటే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. పూర్తి వివరాలకు డిపోమేనేజర్‌ను సంప్రదించాలని కోరారు.

### 'టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం'

**సంగారెడ్డి టౌన్:** జిల్లాలో టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాలలోని వివిధ గ్రామాల కార్యదర్శులు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో టీబీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా టీబీ నివారణ విభాగం, టీబీ అలర్ట్ ఇండియా బ్రేకింగ్ ద బారియర్స్ ప్రాజెక్ట్ సమన్వయంతో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రేకింగ్ ద బారియర్స్ ప్రాజెక్ట్ లీడ్ పి.పురుషోత్తంలో డీఆర్డీఏ అదనపు పీడీ జయదేవ్, తదితరులు పాల్గొన్నారు.

# పోదాం పద 'కేతకి'

**నేటి నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు**

- గతంలో కంటే అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు
- ఆలయంలో కొనసాగుతున్న ఏర్పాట్లు



ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయం



గర్భగుడిలో పార్వతీపరమేశ్వరులు

**ఝరాసంగం(జహీరాబాద్):** భక్తుల ఇలవేల్పు కేతకి సంగమేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాలకు సిద్ధమైంది. మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం నుంచి ప్రారంభం కానున్న వేడుకలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. కరోనా తర్వాత ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చకచక ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. మూడేళ్ల తర్వాత ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో ఆలయానికి భక్తులు పోటెత్తనున్నారు.

- ఆలయ ఉత్సవాల నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ డా.శరత్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంస్ చైర్మన్ ఎం.శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ అన్ని శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. అందుకు అణుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఆలయంతో పాటు పరిసరాల్లో తాగు నీరు, క్యూలైన్లు, స్నానాలు, పార్కింగ్, భారీకేడ్లు, ఆరోగ్యం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయానికి రంగులు, చలువ పందిళ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జహీరాబాద్ డీఎస్పీ రఘు, రూరల్ సీఐ ఎస్.వెంకటేశ్, ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- కోవిడ్ నేపథ్యంలో గత రెండేళ్ల పాటు ఆలయ ఆవరణలోని అమృత గుండంలో భక్తుల స్నానాలకు అనుమతి ఇవ్వలేదు. కొద్ది నెలల క్రితమే అమృత గుండంలో స్నానాలు చేసేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో స్నానాలతో పాటు జలలింగానికి పూజలు చేస్తున్నారు.

**పూజా కార్యక్రమ వివరాలు**

బుధవారం అంకురార్పణ, ధ్వజారోహణం, విఘ్నేశ్వరపూజ, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన. ఉదయం 11.15 గంటలకు శిఖరపూజ, రాత్రి పల్లకీ సేవా భజనలు నిర్వహిస్తారు. 16న స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, 17న స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, సాయంత్రం 5గంటలకు శేషవాహన సేవ, గ్రామ ఊరేగింపు, రాత్రి పల్లకీ సేవా, భజనలు ఉంటాయి. 18న మహాశివరాత్రి, అగ్నిప్రతిష్ఠ, గణపతిహోమం, స్వామి వారికి అభిషేకం, రాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, ఋత్విక్కరణ, పల్లికీ సేవ, భజనలు ఉంటాయి.

- 19న స్వామివారికి, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రస్వాహాకార హోమం, నవగ్రహ శాంతి హోమం, సాయంత్రం 5.30 గంటలకు నందివాహన సేవ, రాత్రి 12గంటలకు అగ్నిగుండం పూజ, అగ్ని ప్రతిష్ఠ ఉంటుంది.

**20న పార్వతీపరమేశ్వరుల కల్యాణం**

ఉదయం 4.30 గంటలకు అగ్నిగుండం, స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రస్వాహాకార హోమం, సాయంత్రం 5.30 గంటలకు పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, రాత్రి 10.30 గంటలకు స్వామి వారి విమాన రథోత్సవం, పల్లకీసేవ నిర్వహిస్తారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనే దంపతులు ముందుగా ఆలయ అధికారులను సంప్రదించి రూ.1,116 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. 21, 22 తేదీల్లో నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. చివరి రోజు 23న లక్ష బిల్వార్చన, అన్నదానం, పల్లకీ సేవా తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయి.



ఆలయ ఆవరణలోని అమృత గుండం

**ఆలయానికి ఇలా చేరుకోవచ్చు**

హైదరాబాద్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ముందుగా జహీరాబాద్‌కు చేరుకోవాలి. అక్కడి నుంచి పస్తాపూర్, మాచ్నూర్, కుప్పానగర్ మీదుగా ఝరాసంగం కేతకి ఆలయానికి చేరుకోవచ్చు. నిజామాబాద్, నారాయణ ఖేడ్, మెదక్, ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రాయికోడ్ చౌరస్తా మీదుగా కప్పాడ్ నుంచి ఝరాసంగం ఆలయానికి చేరుకోవాలి. భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్, జహీరాబాద్ పట్టణాల నుంచి నిత్య బస్సులతో పాటు ప్రత్యేకంగా బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

**వైభవంగా నిర్వహిస్తాం**



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అందరి సహకారంతో వైభవంగా నిర్వహిస్తాం. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గతంలో కంటే పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– నీల వెంకటేశం, పాలక మండలి చైర్మన్, కేతకి

**అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం**



మహాశివరాత్రి వేడుకలకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కంటే ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. అందుకు అణుగుణంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఉత్సవాలకు భక్తులు తరలివచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలి.

– శశిధర్, ఆలయ ఈఓ

### జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ, ఆలయ చైర్మన్ తదితరులు

**ఝరాసంగం(జహీరాబాద్):** మహా శివరాత్రిని పురస్కరించుకొని కేతకి సంగమేశ్వర ఆలయంలో నిర్వహించే ఉత్సవాల ఏర్పాట్లను జహీరాబాద్ ఆర్డీఓ రమేశ్‌బాబు, డీఎస్పీ రఘు పర్యవేక్షించారు. మంగళవారం ఆలయాధికారులతో కలిసి ఏర్పాట్ల వివరాలను తెలుసుకున్నారు. ఆలయ ఆవరణలో పార్కింగ్, క్యూలైన్లు, బారికేడ్లు, తాగు నీటి వసతిని పరిశీలించారు. అనంతరం ఆలయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆలయంలో కొనసాగే పనులు త్వరితగతినప పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ శశిధర్, పాలక మండలి చైర్మన్ నీల వెంకటేశం, జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్, ఝరాసంగం, రాయికోడ్, న్యాల్‌కల్ ఎస్‌ఐలు రాజేందర్‌రెడ్డి, ఏడుకొండలు, వినయ్‌కుమార్, పాలక మండలి సభ్యులు ఎంపీ.నాగన్న, నాగేశ్వర్ సజ్జన్, ఆలయాధికారి శివకుమార్, గిర్దావరి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధార్ అనుసంధానం తప్పనిసరి

**కలెక్టర్ డాక్టర్ శరత్**



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

**సంగారెడ్డి టౌన్:** ఓటర్ కార్డుకు ఆధార్ కార్డును అనుసంధానం చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి ధరణి, ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం, భూసేకరణ, బౌండరీ సమస్యల పరిష్కారం, ఇళ్ల కోసం గతంలో సేకరించిన భూమి వివరాలు, తదితర అంశాలపై రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీలోగా ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం రూరర్‌లో వంద శాతం, అర్బన్‌లో 90 శాతం పూర్తి చేయాలన్నారు. ధరణి మాడ్యూల్స్‌లో వచ్చిన అర్జీలన్నింటినీ పూర్తిస్థాయిలో పరిష్కరించి ఫిబ్రవరి 17లోగా కలెక్టరేట్‌కు పంపాలని తహసీల్దార్లకు ఆదేశించారు. నిమ్జ్, బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలకు సంబంధించి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. టీఎస్ఐఐసీ భూమి హద్దులకు సంబంధించి సమస్యలను పరిష్కరించాలని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ, సంబంధిత తహసీల్దార్లకు సూచించారు. గతంలో ఇళ్ల నిర్మాణం కోసం సేకరించిన భూ వివరాలను అందించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో దేవాదాయ, వక్ఫ్‌బోర్డ్, గ్రామ కంఠం, అసైన్డ్ భూముల్లో అనుమతులు లేకుండా ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలు, విస్తీర్ణం, తదితర వివరాలను అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీపీఓ సురేశ్‌మోహన్, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అవినాష్ నాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కక్షిదారులకు న్యాయం చేయాలి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు**



మాట్లాడుతున్న హనుమంతరావు

**సంగారెడ్డి టౌన్:** కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులో న్యాయవాద వృత్తి విద్యార్థులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలోకి రాగానే క్రమశిక్షణతో కక్షిదారులకు న్యాయం జరిగేలా కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సదస్సులో విజ్ఞాన్ లా కాలేజ్, ముత్తంగి, పటాన్‌చెరు న్యాయవాద వృత్తి విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా**



జోగిపేటలోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

**జోగిపేట(అందోల్):** విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం లంచ్ అవర్‌లో జోగిపేటలోని ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం ఎదుట తెంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ – 82 యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమానికి హాజరైన యూనియన్ జాయింట్ సెక్రటరీ హరికృష్ణ, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ ఏప్రిల్ 22 నుంచి విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీని వెంటనే అమలు పరచాలని, ఆర్టిజన్ ఉద్యోగుల పర్సనల్ పేను బేసిక్ పేలో కలపాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్‌లకు స్టాండింగ్ ఆర్డర్ రూల్స్ తీసేసి విద్యుత్ ఉద్యోగుల మాదిరి ఏపీఎస్ఈబీ రూల్స్ వర్తింపజేయాలని, ఆర్టిజన్ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సమస్యలపై యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే ఈనెల 22వ తేదీన సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు నర్సింలు, ముక్తార్ పాష, రాజేందర్, లక్ష్మన్, కార్తీక్, మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## బోనమెత్తిన ఎమ్మెల్యే క్రాంతికిరణ్

**వట్‌పల్లి(అందోల్):** గ్రామ దేవతలకు పెట్టింది పేరు తెలంగాణ అని అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పోతులబోగూడ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఉత్సావాల్లో పాల్గొన్నారు. ప్రజలతో కలిసి నెత్తిన బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో దేవాలయాలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. ధూప దీప నైవేద్యాలకు కూడా ప్రభుత్వంసాయం ఉందని తలిపారు. రేణుక ఎల్లమ్మ ఉత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. ఖాదిరాబాద్ గ్రామంలోని మల్లికార్జున ఆలయ ప్రథమ వార్షికోత్సవాల్లో భాగంగా గ్రామంలో బోనాలు నిర్వహించారు.

# వందశాతం పన్నులు వసూలు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**అదనపు కలెక్టర్ వీరారెడ్డి**

**సంగారెడ్డి టౌన్:** అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 28లోగా వంద శాతం పన్నులు వసూలు చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీలు, డీఎల్‌పీఓలు, సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గం ఎంపీఓలు, ఎంపీడీఓలు, ఏపీఓలు, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులతో వివిధ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద యాక్టివ్ లేబర్‌లో 50 శాతం మొబిలైజేషన్ కావాలన్నారు. చేసిన పనిని రికార్డు చేస్తూ లేబర్‌కు పే స్లిప్స్ ఇవ్వాలని సూచించారు. ఈజీఎస్‌లో పని కల్పించాలని అడిగిన వారికి 15 రోజుల్లోగా పని కల్పించాలని ఆదేశించారు. తడి పొడి చెత్త అమ్మకంతో గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలని, ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్లు పట్టాలన్నారు. వైకుంఠధామాలు, వైకుంఠరథాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాల చుట్టూ బయోఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసరా పింఛన్లకు అర్హత ఉన్న ఎవరూ మిస్ కావద్దని, అర్హత గలవారిని గుర్తించి వెంటనే దరఖాస్తులను ఎంపీడీఓలకు పంపాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీ

**జహీరాబాద్:** జహీరాబాద్ ఏరియా ఆస్పత్రిని మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ అజయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో ఆపరేషన్ల అనంతరం ఇన్‌ఫెక్షన్‌తో రోగులు మరణించిన నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆస్పత్రులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి అవసరాలపై ఆరాతీశారు. అనంతరం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. వార్డుల్లో పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. వార్డులో నర్సులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. డ్యూటీ నర్సులు వార్డుల్లో ఉండాలని ఆదేశించారు. వైద్యులతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో వైద్యులు శేషబాబు, కిరణ్మయి, శ్రీధర్, గిరి, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

# స్ఫూర్తిప్రదాత సేవాలాల్ మహరాజ్

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- ఖేడ్‌లో ఘనంగా జయంతి ఉత్సవాలు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్:** శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ స్ఫూర్తిప్రదాత అని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నారాయణఖేడ్‌లో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ అనంతరం తహశీల్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను ఉత్సకమిటీ అధ్యక్షుడు కర్ర రమేశ్‌చౌహాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ ఆశయాలను సాధించే దిశగా సీఎం కేసీఆర్ గిరిజనుల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. గిరిజనులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో ఆరు శాతం ఉన్న రిజర్వేషన్లను పదిశాతానికి పెంచినట్లు తెలిపారు. తండాలను పంచాయతీలుగా మార్చారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సేవాలాల్ చౌక్ నుంచి ప్రధాన వీధులగుండా తహశీల్‌గ్రౌండ్ వరకు ర్యాలీ కొనసాగింది. గిరిజన మహిళలు సంప్రదాయ బద్ధంగా బోనాల ఊరేగింపు నిర్వహించారు. సంగ్రాం మహారాజ్, దేవిదాస్ మహరాజ్‌తోపాటు రథంపై సేవాలాల్ వేషాధారణలో ఉన్న భక్తుడితో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఇరకపల్లి పీఠాధిపతి దేవిదాస్ మహరాజ్, ఉత్సవకమిటీ అధ్యక్షుడు కర్ర రమేశ్‌చౌహాన్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, రాజురాథోడ్, ఎంపీపీలు చాందీబాయి, మోతీబాయి, లంబాడా హక్కుల పోరాటసమితి నాయకులు ప్రకాష్ రాథోడ్, నాయకులు మేఘ్యానాయక్, పోమ్యానాయక్, కిషన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో పటాన్‌చెరు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 34 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి(33మంది) రూ.2000 జరిమానా, మరొకరికి రూ.3000 జరిమానా విధించారు.

**సిద్దిపేటలో...**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.24వేల జరిమానా విధించారు.

### ముగ్గురు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. అయితే డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసి, ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

**చిప్స్ కొనడానికి వెళ్లి...**

పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలిక(14) సోమవారం మధ్యాహ్నం తినడానికి చిప్స్ కొంటానని అమ్మమ్మకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన ఆమె తన కూతురుకు జరిగిన విషయంచెప్పింది. మంగళవారం ఉదయం వరకూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తి అరెస్ట్**

ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం...పటాన్‌చెరు పట్టణంలోని ఓ కాలనీకి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని(17) సోమవారం కాలేజీకని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు అదృశ్యమైందని, తండ్రి మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ విద్యార్థిని కుటుంబసభ్యులకు అప్పగించి, తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

**స్కూల్‌కని చెప్పి...**

టీచర్ అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.



మధులత (ఫైల్)

ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం..రామచంద్రపురం పరిధిలోని నాగులపల్లికి చెందిన మధులత వెలమెలలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. సోమవారం స్కూల్‌కని ఇంటి నుంచి వెళ్లింది. అయితే స్కూల్‌కు ఆమె రాకపోవడంతో ప్రిన్సిపల్ మధులత భర్త గోపాల్‌కు ఫోన్ చేశాడు. దీంతో గోపాల్ తన భార్యకు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. భార్య గురించి తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సాయంత్రం బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



# సిద్దిపేటలో సెంట్రల్ ‘నర్సరీ’

- మర్పడ్గలో 50 ఎకరాల్లో ఏర్పాటు
- హరితనిధి నుంచి రూ.5.85 కోట్లు మంజూరు



మర్పడ్గలోని తేజోవనం ఇదే..

సాక్షి, సిద్దిపేట: పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. 2016లో ప్రతిష్టాత్మకంగా తెలంగాణకు ‘హరితహారం’ కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా పల్లె, పట్టణాలన్నీ హరితమయం అయ్యాయి. పల్లె ప్రకృతి వనం, బృహత్ ప్రకృతి వనం, అర్బన్ పార్కు, అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుతో ఎక్కడ చూసినా పచ్చదనం వెల్లివిరుస్తోంది. సిద్దిపేట పట్టణ శివారులోని మార్పడ్గలో ఐదెకరాల విస్తీర్ణంలో తేజోవనం పార్కు ఉంది. ఇక్కడే నర్సరీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రభుత్వభూమి కూడా ఉంది. దీంతో 50 ఎకరాల్లో నర్సరీ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

- 50 ఎకరాల విస్తీర్ణంలో 50 లక్షలకు పైగా మొక్కలు పెంచేందుకు అనువైన స్థలం ఉందని మంత్రి హరీశ్‌రావు చొరవతో అధికారులు నర్సరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.
- హరితనిధిలో భాగంగా సిద్దిపేటజిల్లాకు అటవీశాఖ సెంట్రల్ నర్సరీ మంజూరైంది. మూడేళ్లకు గాను రూ5.85 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 2022–2023కు రూ1.51 కోట్లు, 2023–2024కు రూ1.18కోట్లు, 2024–2025కు రూ 3.14కోట్లు ప్రభుత్వం అందించనుంది
- తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచే పద్ధతులను ఈ నర్సరీలో అవలంబించనున్నారు.
- ట్రేలల్లో గింజలు నాటి మొలకెత్తిన తర్వాత బ్యాగుల్లోకి మారుస్తారు. మీటరున్నర నుంచి 3 మీటర్ల ఎత్తు వరకు ఉండే మొక్కలను పెంచేందుకే ఇక్కడ నర్సరీ ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రీన్ పాలిహౌస్‌లు, షెడ్లు నిర్మించి పెద్ద మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలు ఇక్కడే పెంచేందుకు ప్రణాళిక రూపొందించారు.

**ఇక్కడి నుంచే అరుదైన మొక్కలు సరఫరా**



అరుదైన మొక్కలను గతంలో ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించే వాళ్లం. త్వరలో సిద్దిపేటలో అరుదైన మొక్కలు పెంచుతాం. ఇక ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు మొక్కలను సరఫరా చేస్తాం. మంత్రి హరీశ్‌రావు చొరవతో జిల్లాకు అటవీశాఖ సెంట్రల్ నర్సరీ మంజూరైంది. ఏటా 50 లక్షలకు పైగా మొక్కలు పెంచాలన్న లక్ష్యంగా నర్సరీ ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

–శ్రీనివాస్, డీఎఫ్ఓ

# బియ్యం లారీలో మంటలు



శివ్వంపేట వద్ద మంటల్లో కాలిపోతున్న లారీ

జోగిపేట(అందోల్): చౌటకూర్ మండలం శివ్వంపేట శివారులో మంగళవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో లారీలో ఉన్న రూ.పదిలక్షల విలువ చేసే బియ్యం బూడిదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. బియ్యంలోడ్‌తో ఉన్న లారీ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి నాందేడ్‌కు బయలుదేరింది. 161వ జాతీయ రహదారిపై శివ్వంపేట మీదుగా వెళుతుండగా, లారీ వెనుక భాగంలో ఎడమవైపున ఉన్న టైర్ బాగా వేడెక్కి మంట అంటుకుంది. ఆ మంట లారీ బాడీకి వ్యాప్తించాయి. దీంతో లారీలో ఉన్న 25 టన్నుల బియ్యంలో సగానికిపైగా కాలిబూడిదైంది. ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను ఆర్పేశారు. అయితే సాయంత్రం వరకు లారీకి సంబంధించిన వ్యక్తులెవరూ రాలేదని పుల్కల్ ఎస్ఐ గణేష్ ‘సాక్షి’కి తెలిపారు. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, లారీ దూర ప్రాంతం నుంచి రావడంతో టైర్లు వేడెక్కాయి. టైర్‌కు మంటలు వచ్చిన విషయాన్ని డ్రైవర్ సకాలంలో గుర్తించని కారణంగా భారీగా నష్టం జరిగింది. అయితే లారీ యజమాని వచ్చేవరకు నష్టం వివరాలు చెప్పలేమని ఎస్ఐ తెలిపారు.

## రాజగోపురం వద్ద యాచకుడి మృతి



వరదయ్య మృతదేహం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో తిరిగే యాచకుడు వరదయ్య(64) మంగళవారం రాజగోపురం వద్ద మరణించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనస్థలికి చేరుకొని హైదరాబాద్‌లో ఉంటున్న మృతుడి కుటుంసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రాజగోపురం వద్ద మృతి చెందడంతో ఆలయాన్ని మూసివేశారు. సాయంత్రం సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

# బ్యాంకుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



ఆర్‌బీఐ పోస్టర్ ఆవిష్కరణలో సీపీ శ్వేత, పోలీసులు, బ్యాంక్ అధికారులు

**బ్యాంక్ అధికారుల సమావేశంలో సీపీ శ్వేత**

సిద్దిపేటకమాన్: భద్రత దృష్ట్యా ప్రతి బ్యాంకు లోపల, బ్యాంకు ముందు సీసీ కెమెరాలు తప్పనిసరిగా బిగించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్. శ్వేత బ్యాంకు అధికారులకు సూచించారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలో సీసీ కెమెరాలు, సైబర్ క్రైమ్స్, ట్రైనింగ్స్‌పై బ్యాంక్ అధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ ఎక్కువ నేరాలు బ్యాంకు పరిసరాల్లోనే జరుగుతున్నందున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా సీసీ కెమెరాల ప్రాధాన్యం, కమిషనరేట్ పరిధిలో జరిగిన దొంగతనాలను సీసీ కెమెరాల సాయంతో చేధించిన విధానాన్ని సీపీ వారికి వివరించారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ నీరజ మాట్లాడుతూ సీసీ కెమెరాలకోసం తమ ఉద్యోగుల నుంచి సామాజిక బాధ్యతగా కొంత మొత్తంలో నిధులు సేకరిస్తామన్నారు. లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరిగినప్పుడు పోలీసులకు కావాల్సిన సమాచారం చెప్పి, బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి వారి ఖాతాల్లో చేరేలా చూస్తామన్నారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రాజలింగం మాట్లాడుతూ నిరుద్యోగ యువకులకు పోలీస్‌శాఖ సమన్వయంతో సీసీటీవీ మెయింటెనెన్స్ అండ్ రిపేర్‌పై 13 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఆర్‌బీఐ రూపొందించిన బ్యాంకుకు సంబంధించిన సమాచార పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేష్ పాల్గొన్నారు.

# ఆ ఇద్దరు ఎక్కడ?

- వివాహితను యువకుడు బైక్‌పై తీసుకెళ్లినట్టు సీసీ ఫుటేజీ !
- చెరువువద్ద బైక్, ఇద్దరి చెప్పులు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నార్సింగిలో వీడని మిస్టరీ



చెరువు వద్ద గుమికూడిన జనం



చెరువు వద్ద వదిలి వెళ్లిన బైక్, చెప్పులు

రామాయంపేట(మెదక్): నార్సింగిలో ఇద్దరి అదృశ్యం మిస్టరీగా మారింది. మండల కేంద్రానికి చెందిన వివాహిత, మరో యువకుడు ఒకే బైక్‌పై సోమవారం రామాయంపేటలో కలిసి తిరిగినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయినట్టు తెలిసింది. అయితే ఆ బైక్ , ఇద్దరి చెప్పులు మంగళవారం ఉదయం నార్సింగి చెరువు వద్ద లభ్యమయ్యాయి. కూతురు కనిపించడం లేదని ఆమె తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదైంది. సదరు యువతికి మూడు నెలల క్రితం వివాహం జరిగింది. శివరాత్రి పండగ నిమిత్తం ఈనెల తొమ్మిదివ తేదీన ఆమెను అత్తగారింటినుంచి నార్సింగి తీసుకొచ్చారు. చెరువు వద్ద బైక్, చెప్పులు లభించడంతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకొని ఉంటారని ముందుగా అందరూ అనుమానించారు. విషయం తెలియగానే గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. పోలీసులు గజ ఈతగాళ్లు, వలలతో చెరువులో గాలించినా ఇద్దరి ఆచూకీ లభించలేదు. అయితే అందరి దృష్టిని మళ్లించడానికే బైక్, చెప్పులు చెరువు వద్ద విడిచి వెళ్లినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా మిస్టరీగా మారిన ఈకేసును త్వరలోనే చేధిస్తామని నార్సింగి ఎస్ఐ నర్సింలు పేర్కొన్నారు.

# చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

**సిద్దిపేట జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.**



జంగం ఎల్లయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): భూంపల్లి ఏఎస్ఐ రవీందర్ తెలిపిన కథనం ప్రకారం..మోతె గ్రామానికి చెందిన జంగం ఎల్లయ్య (45) మరో ఇద్దరితో కలిసి సోమవారం రాత్రి బైక్‌పై దుబ్బాకకు బయలుదేరాడు. మోతె శివారులోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ లైట్ల ఫోకస్‌తో ఎల్లయ్య కళ్లకు ఒక్కసారిగా బైర్లు కమ్ముకున్నాయి. దీంతో బైక్ అదుపు తప్పింది. రోడ్డు పక్కనున్న మర్రిచెట్టు ఊడలకు తగిలి ఎల్లయ్యతో పాటు ఆ ఇద్దరూ కూడా కిందపడి గాయాలయ్యాయి. 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**గిరిపల్లి సమీపంలో...**



కనకరాజు(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రాయపోల్ మండలం వీరానగర్‌కు చెందిన లక్కుమల్ల కనకరాజు (20) భవన నిర్మాణ కార్మికుడిగా, అదే గ్రామానికి చెందిన సిందం చంద్రం కూడా గజ్వేల్‌లో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి పని ముగిసిన తర్వాత కనకరాజు ద్విచక్ర వాహనంపై వీరానగర్‌కు బయలుదేరగా, చంద్రం సైకిల్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో గజ్వేల్ మండలం గిరిపల్లి సమీపంలో సైకిల్‌పై ముందుగా వెళుతున్న చంద్రంను ఢీకొని కనకరాజు కిందపడిపోయాడు. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కనకరాజుకు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రెగ్జిన్ షాప్‌లో చోరీ

చేర్యాల (సిద్దిపేట): రెగ్జిన్ షాప్‌లో చోరీ జరిగింది. ఈ సంఘటన మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండల పరిధిలోని మాసిరెడ్డి పల్లికి చెందిన ఘనపురం ప్రసాద్ పట్టణ కేంద్రంలో ఉంటూ రెగ్జిన్‌షాప్ నిర్వహిస్తున్నాడు రోజువారి లాగానే సోమవారం రాత్రి షాప్‌నకు తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా షాప్ తాళం పగలగొట్టి ఉంది. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని క్లూస్ టీం సాయంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లక్ష రూపాయల నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారని బాధితులు వాపోయాడు.

## పెట్రోల్ బంక్‌లో దొంగతనం



కార్యాలయ తలుపులు తొలగించిన దృశ్యం

నారాయణఖేడ్: సిబ్బంది నిద్రిస్తున్న వేళ..పెట్రోల్ కోసం వచ్చినవారు చోరీకి పాల్పడ్డారు. బంక్ నిర్వాహకుడు ప్రభాకర్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం..నారాయణఖేడ్- నిజాంపేట్ జాతీయ రహదారిపై ఖేడ్ శివారులో మహాలక్ష్మి పెట్రోల్‌బంక్ ఉంది. ఇంధనం కోసం కొందరు వచ్చారు. తెల్లవారుజామున సిబ్బంది నిద్రిస్తున్న విషయాన్ని గుర్తించి కార్యాలయ తలుపులు బద్దలు కొట్టి టార్చ్‌లైట్ సహకారంతో మూడు సెల్ ఫోన్లు, నగదు ఉన్న బ్యాగును అపహరించారు. ఉదయం లేచాక సిబ్బంది తలుపులు తొలగించి ఉన్న విషయాన్ని గుర్తించి నిర్వాహకుడికి సమాచారం ఇచ్చారు. చోరీ ఘటన సీసీ పుటేజీలో రికార్డు అయ్యిందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రభాకర్ తెలిపారు.

## మూడిళ్లలో చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): ఒకే రోజు మూడు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని గౌరయపల్లిలో సోమవారం రాత్రి జరిగింది.

- గ్రామానికి చెందిన నీల కనకయ్య కొమురవెల్లి జాతరలో హోటల్ నిర్వహించేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చిచూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి 70 తులాల వెండి, 25 గ్రాముల బంగారం చోరీకి గురైంది.
- తాడూరు బాలయ్య ఇంటికి కొడుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి 50 తులాల వెండి, రూ.20 వేలనగదు ఎత్తుకెళ్లారు.
- కర్ణాకర్‌రెడ్డికి చెందిన ద్విచక్రవాహనం కూడా ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శంకర్ కుటుంబానికి ఠాక్రే పరామర్శ



శంకర్ తల్లితో మాట్లాడుతున్న మాణిక్‌రావుఠాక్రే

పటాన్‌చెరు: టీ పీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింధు శంకర్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే పరామర్శించారు. శంకర్ కుటుంబం అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలోని సూర్యోదయ కాలనీలో నివసిస్తోంది. మాణిక్‌రావు ఠాక్రే మంగళవారం రాత్రి శంకర్ ఇంటికి వచ్చారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. చిత్రపటం వద్ద నివాళులు అర్పించి శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఠాక్రే వెంట ఏఐసీసీ కార్యదర్శి బోస్‌రాజ్, నదీమ్ జావీద్, జిల్లా కాంగ్రెస్ నేతలు కాట శ్రీనివాస్‌గౌడ్, గాలి అనిల్‌కుమార్, వడ్డె జైపాల్ తదితరులు ఉన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నరేశ్ (ఫైల్)

మెదక్ రూరల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన హవేళిఘణాపూర్ మండలం బూరుగుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గడ్డం నరేశ్ (28) రాత్రి ఏడు గంటల సమయంలో కరెంట్ సరఫరాలో అంతరాయం వచ్చిందని, విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై ఆయిల్‌ఫెడ్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్, ఏఓ రమణిలు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ , రైతుబంధు సమితి మండల కన్వీనర్ బాల్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ భాస్కర్, ఏఈఓలు నాగార్జున, సంధ్య, ఉపసర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పరస్పర దాడులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఒకరిపై మరొకరు దాడి చేసుకొని పోలీసులను ఆశ్రయించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో అక్బర్ మాంసం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. కాగా రఫీ అక్కడకు వెళ్లాడు. ఇద్దరూ ఘర్షణ పడ్డారు. రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రఫీని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గతంలో రఫీ అక్బర్ ఇంట్లో అద్దెకు ఉండేవాడని పోలీసులు తెలిపారు. జరిగిన ఘటనపై ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నేడు ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని కేసీఆర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో మహాత్మాజ్యోతిరావుపూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలను మంత్రి హరీశ్‌రావు బుధవారం ప్రారంభించనున్నారు. ఇప్పటికే సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటికే రెండు ఎంజేపీలు అందుబాటులోకి వచ్చాయి.

# వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

**వేర్వేరు చోట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు.**

**భార్యకు దూరమై...**

కోహీర్(జహీరాబాద్): భార్యకు దూరమై..తాగుడుకు బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కోహీర్ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ..మండల పరిధిలోని మనియార్‌పల్లికి చెందిన జయరాజ్(34)కు 2013లో మర్పల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నవనీతతో వివాహం జరిగింది. పెళ్లి జరిగి తొమిదేళ్లయినా సంతానం లేదు. కుటుంబ కలహాల కారణంగా ఆరు నెలలుగా భార్య పుట్టినింటిలో ఉంటోంది. దీంతో జయరాజ్ భార్యకు దూరమై తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలంపనికి వెళ్లిన తల్లి ఇంటికి వచ్చేసరికి కొడుకు మృతదేహం దూలానికి వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**తాగుడుకు బానిసై...**

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిస అయ్యి జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని వేలూరుకు చెందిన బగ్గి చంద్రయ్య(62)కు ఇద్దరు భార్యలు, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. కరోనా సమయంలో మొదటి భార్య చనిపోయింది. కొడుకు ఇంటినుంచి వెళ్లిపోయి గజ్వేల్‌లో ఉంటున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసైన చంద్రయ్య తరచు రెండో భార్యతో గొడవపడేవాడు. దీంతో ఆమె కూడా విసిగి వెళ్లిపోయింది. నాటి నుంచి ఇంట్లో చంద్రయ్య ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తాను చనిపోతానంటూ రెండో కూతురుకు ఫోన్ చేశాడు. ఇంట్లోనే ఫ్యాన్ కొండికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**భార్యతో గొడవ పడి..**

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడిన ఓ భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మొహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ప్రశాంత్(27) ఓప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై తరచు ఇంట్లో గొడవపడేవాడు. సోమవారం రాత్రి కూడా మద్యం సేవించాక ఇంటికి వచ్చి భార్య, కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియపెట్టుకున్నాడు. కుటుంబసభ్యులు తలుపులు తీసి చూసేసరికి సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని కనిపించాడు. గమనించిన వారు వెంటనే ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**అప్పుల బాధ భరించలేక..**



సంపత్ కుమార్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని చిన్నచింతకుంటకు చెందిన సంపత్‌కుమార్(38) ప్రైవేట్ వ్యాపారుల వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబపోషణ, పిల్లల చదువులు, ఇతర అవసరాలకు చేసిన అప్పులు పెరిగాయి. వాటిని తీర్చేదారి కనిపించక మంగళవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.